# చెవుడుగొడవ

కనుపర్తి వరలక్ష్మమ్మగారు

అనగా అనగా ఒకవూళ్లో తల్లీ దండ్రీ, కొడుకూ కోడలు గల ఒకకుటుంబము ఉండేది. దైవవశాత్తు వాళ్లు నలుగురూ చెవిటివాళ్లే; కాబట్టి ఒకరిమాట ఒకరికి తెలియక రోజూ కొట్టుకులాడుతుండేవాళ్లు. ఇట్లా ఉండగా ఒక నాడు కొడుకు పొలము దున్నటానికి పొద్దున్నే లేచి ఎడ్లను తోలుకొని పొలము వెళ్లాడు. అక్కడతడు పొలం దున్నుకుంటుండగా ఒక బాటసారి ముందూరికి దోవ తెలియక తంటాలు పడుతూ వీనివద్దకు పోయి 'అయ్యా ఫలానీవూరికి యిదేనా దారి' అని అడిగాడు. వాడు చెవిటివాడు కాబట్టి బాటసారి అడిగిన మాట తెలియక తనవద్దకు ఎడ్లబేరానికి వచ్చాడనుకొని 'ఎఱ్ఱెద్దు ఏడొరాలు, నల్లెద్దు నాలుగొరాలు. ఇంతకు గవ్వ తగ్గితే యివ్వ' నన్నాడు. అతడుచెప్పినమాటల కాబాటసారి తెల్లబోయి 'ఇదేమిరా వూరికి దారిఅడిగితే ఎద్దులధర చెప్పతాడు. చెవిటివాడు కాబోలు'నను కొని 'ఇక వీడితో అడిచే దెందుకు మఱెవ్వరినైనా అడుగుదా' మని తనదారిని పోయినాడు. ఇతలో పొల్లముదున్నే చెవిటివాడి పెండ్లాము, మొగుడికి దుత్తలో బువ్వపెట్టుకొని తెచ్చింది. దాన్ని చూచి మొగుడు 'మనయెద్దులకు బేర మొచ్చింది. ఎఱ్ఱెద్దు ఏడొరాలు నల్లెద్దు నాల్గొరాలు. ఇంతకుగవ్వ తగ్గితేయివ్వనన్నాను'అని చెప్పాడు. ఆపెండ్లామూ చెవిటిదే కాబట్టి మొగిడిమాట తెలియక వేడిబువ్వ తేక చద్దిబువ్వెందుకు తెచ్చావని మొగుడు కోపంచేస్తున్నాడనుకొని 'అత్త పెట్టి యిచ్చిన బువ్వదుత్తే నేను తీసుకొచ్చాను. చద్దిబువ్వ తెచ్చావని నన్ను కూకలేస్తావే'మని మొత్తుకోటం మొదలుపెట్టింది. మొగుడు ఎద్దులబేరం చెప్పా, పెండ్లాంబువ్వసంగతిచెప్పా, ఇట్లా ఒకరిమాటఒకరికి తెలియక కాసేపు వాదించుకొని యింటికి పోయినారు. అక్కడ తల్లి యెవరితోనో మాట్లాడుతున్నది. ఆమె దగ్గిఱకిపోయి కొడుకు యెద్దులబేరం సంగతి కోడలు, బువ్వదుత్తసంగతి చెప్పారు. ఆవిడా చెవిటిదే కాబట్టి కొడుకూ కోడలూ చెప్పేసంగతులు వినపడలేదు. పైగా తాను యెవరితోనో మాట్లాడుతుండటంచే 'వాళ్లతో నీకు మాట లేమి' టని మందలిస్తున్నారనుకొని 'పెద్దదాన్ని కనుక యెవరితోనైనా మాటా మంచీ ఆడుతాను. నాకు మీ అదుపులేమి' టని జగడం ప్రారంభించింది. ఈవిధంగా ఒకరిమాట ఒకరికి తెలియక ముగ్గురూ కాసేపు కుమ్ములాడి తండ్రి వద్దకుపోయినారు. ఆముసలివాడు శనగగుగ్గిళ్లు తింటూ కూర్చున్నాడు. వాడితో పెండ్లాము, కొడుకూ, కోడలూ తమతమగొడవలు చెప్పుకున్నారు. వాడూ చెవిటివాడే కాబట్టి వాళ్లు చెప్పేమాటలు అర్థం కాలేదు. పైగా తనకు 'పెట్టిన గుగ్గిళ్లు గాక యింకా చాటుగా తెచ్చుకొని తింటున్నావా' అని వాళ్లందఱు తన్ను కోప్పడుతున్నారనుకొని 'అయ్యో నీవుపెట్టిన

గుగ్గిళ్లేనే నేను యింకా యెక్కడ తెచ్చుకున్నానే' అని మొత్తుకోడం మొదలుపెట్టాడు. ఇట్లాొకరిసంగతి ఒకరికి తెలియక వాదించుకొని వాదించుకొని తమతగువు పరిష్కారంగాక ఆవూరి కరణంవద్దకు పోయినారు. ఆకరణంగూడా చెవిటివాడే. అతడు పెండ్లాముతో ఎందుకో పోట్లాడి అప్పుడే వచ్చి అరుగుమీద కూర్చున్నాడు. ఇంతలో ఈచెవిటివాళ్లు ఆకరణంవద్ద చెప్పుకోడానికి పోయినారు. ముందు ముసలివాడుఆకరణాన్ని చూచి'అయ్యా! తమరుపెట్టిన గుగ్గిళ్లే నేను తింటూంటే ఇంట్లో గుగ్గిళ్లు దొంగతనంగా తెచ్చి తింటున్నానని జగడమాడుతున్నారు చూడండి' అన్నాడు. తరువాత వాడిపెండ్లాము వచ్చి 'నేను పెద్దదాన్నిగదా, నన్ను వారితో వీరితో మాట్లాడవద్దని అదుపుజేస్తారు చూడండి' అన్నది. తరువాత కొడుకువచ్చి 'పొద్దునయెద్దులకు బేరంవచ్చింది ఎఱ్ఱెద్దు యేడ్రాలు, నల్లెద్దు నాల్గొరాలు అంతకు గవ్వ తగ్గితే యివ్వనన్నాను. ఏమండీ తగ్గించియివ్వడానికి నాయెద్దులు చచ్చువా పుచ్చువా' అన్నాడు. తరువాత కోడలొచ్చి 'అత్తపెట్టియిచ్చిన బువ్వనే నేను తీసుకుపోతే వేడి బువ్వతేక చద్దిబువ్వ తెచ్చావేమని నన్ను తిట్టుతున్నాడు చూడండి' అని మొఱపెట్టుకొన్నది. ఆచెవిటికరణంగారికి వీరుచెప్పిన మాటలు తెలియలేదు. కాబట్టి తాను పెండ్లాముతో పోట్లాడి ఉండడంచేత ఆమెతో సమాధానపడమని చెప్పుతున్నారనుకొని "మీారు నూరుచెప్పండి వెయ్యిచెప్పండి;ఆముండ మొఖం నేను చూడను. దానిచేతి అన్నము నేనుతినను." అనడం మొదలుపెట్టాడు.

ఈవిధంగా ఒకరిమాట ఒకరికి తెలియక వాదించుకుంటున్నారు. తిండీ లేదు. తిప్పలూ లేదు. పొద్దు తిరిగిపోయింది. ఇంతలో ఒక మంచి వాడు-అంటే చెవుడు లేనివాడు-అక్కడకొచ్చాడు. వాడితో యీచెవిటి వాళ్లయిదుగురు తమతమ గొడవలు చెప్పుకొన్నారు. వాడు వారిమాట లన్నీ విని పక్కున నవ్వుకొని ఒకరిమాట లొకరికి తెలిసేటట్లు పెద్దగా అఱచి చెప్పి సమాధానం పెట్టాడు. అయిదుగురు చెవిటివాళ్లకు సమాధానం చెప్పేటప్పటికి మంచివాడిగొంతు చించుకుపోయింది.

అంతే కథ కంచికి పోయింది; మనం యింటికొచ్చాము.

---